రూ. 17.50 లక్షలు పలికిన తైబజార్

మంచిర్యాలటౌన్, మార్చి 12: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో తైబజార్ నిర్వహించుకునేందుకు పిలిచిన వేలంపాటలో రూ. 17.50 లక్షలకు పాటపాడి అనుముల నగేశ్ దక్కించుకున్నాడు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మారుతీ ప్రసాద్, మేనేజర్ విజయ్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మజార్, సిబ్బంది ఆధ్వర్యంలో తైబజార్‌తో పాటు మేకల మండి, మున్సిపల్ దుకాణాలకు వేలంపాటలను నిర్వహించారు. అనుముల నరేశ్, సలెగొండ ప్రవీణ్‌కుమార్‌లు పోటీపడగా అధికంగా పాటపాడిన నరేశ్‌కు తైబజార్ దక్కింది. మేకలమండి అధిక దరతో పాట నిర్వహిస్తున్నారని గుత్తేదారులు పాల్గొనలేదు. మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న ఐడీఎస్ ఎంటి షాప్ నం.1 కోసం పిలిచిన వేలం పాటలో ఇద్దరు పాల్గొనగా రూ. 14,100కు కలవల సంతోష్, రెండో నంబర్ షాప్‌ను రూ. 14,400 లకు వేలంపాట పాడి తులా సాగర్ దక్కించుకున్నాడు. షాపు నంబర్ 24ను రూ. 5400 లకు హిందూసేవక్ సమాజ్ ఫౌండేషన్ దక్కించుకున్నది.

ఘనంగా ఫేర్‌వెల్

దండేపల్లి, మార్చి 12 : దండేపల్లి మండలంలోని వెల్గనూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫేర్‌వెల్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విచారణ పూర్తి

వేమనపల్లి, మార్చి 12 : మండలంలో ధరణి పెండింగ్ దరఖాస్తుల విచారణ పూర్తయినట్లు తహసీల్దార్ రమేశ్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సూచించడంతో, మండలంలో 93 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడిన వెంటనే సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మణ్, ఎంసీ ఆసిఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌ను నియమించాలి

బెల్లంపల్లి, మార్చి 12: బెల్లంపల్లి గ్రంథాలయంలో రెగ్యులర్ లైబ్రేరియన్‌ను నియమించాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్ రాజు కోరారు. అదనపు కలెక్టర్ రాహుల్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. గ్రంథాలయం పని వేళలను రాత్రి 8 గంటల వరకు పెంచాలని కోరారు. పోటీ పరీక్షలకు అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. సెలవు దినాల్లోనూ నడిపించాలని కోరారు. నాయకులు రంగ ప్రశాంత్, చల్లా జయభరత్‌రెడ్డి, శివ ప్రసాద్, వెంకట్‌సాయి, రాజలింగు, సాయికుమార్ పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ టోర్నీ

కాసిపేట, మార్చి 12 : కాసిపేట మండలంలోని తాటిగూడలో బెల్లంపల్లి అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. మొత్తం 28 జట్లు పాల్గొనగా హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో బుగ్గ గూడెం జట్టు ప్రథమ స్థానంలో నిలువగా రాంపూర్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.5000, రెండో బహుమతి రూ.3000 అందించారు. ఈ బహుమతులను బెల్లంపల్లి ఎఫ్డీవో విజయ్ కుమార్, బెల్లంపల్లి రేంజర్ ఏ సుభాష్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, బీట్ ఆఫీసర్లు సురేశ్, కుమారస్వామి, యుగేందర్, ఇతర సిబ్బంది, క్రీడాకారులున్నారు.

ప్రెస్ క్లబ్ రీడింగ్ భవన నిర్మాణానికి భూమిపూజ

జన్నారం, మార్చి 12 :మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ప్రెస్ క్లబ్ రీడింగ్ భవన నిర్మాణానికి ఎంపీడీవో శశికళ భూమిపూజ చేశారు. నిర్మాణానికి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు రూ.4లక్షల మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సింగిడి రమేశ్, సీతర్ జేఈ సతీశ్, కార్యదర్శి రాహుల్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ నర్సయ్య, ప్రధాన కార్యదర్శి గాజుల లింగన్న గౌడ్, ఎంబడి మల్లేశం, జాడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్
- కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, అధికారులు

నస్పూర్, మార్చి 12 : రానున్న పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 సంవత్సరాలు నిండినవారందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ప్రాంతాలు, పేరు మార్పులతో పాటు, ఓటరు జాబితాలో చనిపోయిన వారి వివరాల తొలగింపు, చిరునామా మారిన వారి వివరాల సవరణ, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు, సూచనలు స్వీకరించాలన్నారు. ఎన్నికల కార్యాచరణ విడుదల అనంతరం ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం జిల్లాలో పూర్తిస్థాయి బందోబస్తు, నిఘా ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయడంతో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 18–19 సంవత్సరాల మధ్య 17089 మంది, 20–29 ఏళ్ల మధ్య 1,33,528 మంది, దివ్యాంగులు 10,297 మంది, వృద్ధులు 7,971 మంది, ట్రాన్స్‌జెండర్లు 45 మంది, పీవీటీజీలు 904 మంది సెక్స్ వర్కర్లు 2,171 మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, ఆర్డీవో రాములు, ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక ఉప పాలనాధికారి చంద్రకళ, డీఆర్డీవో కిషన్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణపై రైతులకు అవగాహన

బెల్లంపల్లిరూరల్, మార్చి 12: బెల్లంపల్లి మండలంలోని కన్నాల రైతువేదిక లో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో డివిజన్ పరిధిలోని మామిడి రైతులకు మామిడి సాగులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. ముందుగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచేందుకే ఈ రకమైన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గోపి, సంగారెడ్డి పండ్లతోటల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుచరిత అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ (జగిత్యాల) డాక్టర్ శ్రీనివాస్ , డాక్టర్ ప్రగతి కుమారి మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రత ప్రభావం వల్ల వివిధ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మామిడి పిందెలు రాలడాన్ని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సేంద్రియ సాగు పద్ధతులు, వ్యవసాయ అవగాహన కార్యక్రమాలపై వివరించి, పలు సూచనలు చేశారు.

సీఎంఆర్‌ను త్వరగా పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ మోతీలాల్
- రైస్ మిల్లర్లకు ఆదేశం

అధికారులు, మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాల అర్బన్, మార్చి 12 : 2023–24 వానకాలం సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ డెలివరీ త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో సివిల్ సప్లయ్ అధికారులు, మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2022–23 యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం బస్తాలను క్రమ పద్ధతిలో నిల్వ ఉంచాలని తెలిపారు. ప్రభుత్వం ఈ ధాన్యాన్ని వేలంలో పెట్టిందని, వేలం పాడిన వారు కేటాయించిన ధాన్యాన్ని తీసుకెళ్తారని చెప్పారు. మిల్లర్లు అప్పగించేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో సివిల్ సప్ల య్ డీఎం గోపాల్, సిబ్బంది మహిపాల్ సింగ్, రజిత, రా జు, అన్వేష్, గంగాధర్, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలి

సీసీసీ నస్పూర్, మార్చి 12: తల్లిదండ్రులు తమ పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని పాజిటీవ్ పేరెంటింగ్ ట్రైనర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మంగళవారం సీసీసీ నస్పూర్‌లోని మార్టిన్ గ్రామర్ హైస్కూల్‌లో ''పిల్లల భవిష్యత్తులో తల్లిదండ్రుల పాత్ర'' అనే అంశంపై పేరెంట్ ఓరియేంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటి పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోన్లకు బానిసలవుతున్నారని, ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. నిజాయితీ, గౌరవం, క్రమశిక్షణ, బాధ్యత, ధైర్యం, కృతజ్ఞత అనే విషయాలను పిల్లలకు అర్థం చేసే క్రమంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సబిహ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ సయ్యద్ మిరాన్‌ఇమ్రాన్, సయ్యద్ వసీమ్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి

- డీఆర్డీవో కిషన్
- ఈజీఎస్ పనుల పరిశీలన

కోటపల్లి, మార్చి 12 : ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీవో కిషన్ ఆదేశించారు. కోటపల్లి మండలంలోని పారుపల్లి, కొల్లూరు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను డీఆర్డీవో కిషన్ సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఉదయమే కూలీలు పని ప్రదేశానికి చేరుకొని కొలతల ప్రకారం పనులను చేయాలని సూచించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆకుల భూమయ్య, పంచాయతీ కార్యదర్శులు మధూకర్, రాజలింగు, ఏపీవో బాలయ్య, ఈసీ నాగేందర్. టీఏలు సరిత, సతీశ్, ఉపాది సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మంచిర్యాల అర్బన్, మార్చి 12 : కలెక్టరేట్ ఎదుట మంగళవారం అంగన్‌వాడీ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ కేం ద్రాల్లో బయోమెట్రిక్, సీసీ కెమెరాలు పె ట్టాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అంగన్‌వాడీ ఉద్యోగులపై చేసిన వ్యాఖ్యలు వెన క్కి తీసుకోవాలని, అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరించే ఆలోచనా విధానాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీ స వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరు తూ కలెక్టర్‌కు వినతి ప త్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు ప్రసన్న, ప్రవీణ, విక్టోరియా, లావ ణ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపలరంజిత్ కుమార్, జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కుర్చీల పంపిణీ

జైపూర్, మార్చి 12: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని షెట్‌పల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అటవీశాఖ అధికారులు కుర్చీలు పంపిణీ చేశారు. పాఠశాలలకు కనీస వసతులు కల్పించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద (సీఎస్ఆర్) అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మేనేజర్‌లు జీ సురేశ్ కుమార్ (మంచిర్యాల రేంజ్ 1), ఈ లక్ష్మణ్ (మంచిర్యాల రేంజ్ 2), పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధిక, సూపర్ వైజర్ శ్రీనివాస్, వాచర్‌లు శంకర్, సాయికిరణ్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

మందమర్రి రూరల్, మార్చి12: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మందమర్రి మండలంలోని వెంకటాపూర్, ఎమ్మెల్యే కాలనీలలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం కుర్చీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ అభివృద్ధి సంస్థ ప్లాంటేషన్ మేనేజర్‌లు జీ సురేశ్ కుమార్ (మంచిర్యాల రేంజ్ –1),ఈ.లక్ష్మణ్ (మంచిర్యాల రేంజ్ –2),ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు గణేశ్, శశిధర్ రావు, అటవీ అభివృద్ధి సంస్థ సూపర్ వైజర్ శ్రీనివాస్, వాచర్‌లు, సిబ్బంది శంకర్, సాయికిరణ్, సాయికృష్ణ పాల్గొన్నారు

టీఎన్జీవో సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

హాజీపూర్, మార్చి 12 : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల (టీఎన్జీవో) సంఘం మంచిర్యాల జిల్లా డైరీ, క్యాలెండర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్ నాంపల్లి భవన్‌లో ఆవిష్కరించారు. అంతకు ముందు రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జదీశ్‌ను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపు రావు, కోశాధికారి సతీశ్ కుమార్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, ఉపాధ్యక్షుడు తిరుపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు

మంచిర్యాల అర్బన్, మార్చి 12 : లయన్స్ క్లబ్ రీజియన్ మీట్‌లో మంచిర్యాల లయన్స్ క్లబ్ 18 అవార్డులను సొంతం చేసుకుంది. బెస్ట్ ప్రెసిడెంట్‌గా బాలాజీ, బెస్ట్ సెక్రటరీగా వెంకటేశ్వర్లు, బెస్ట్ ట్రెజరర్‌గా రామస్వామి, రీజియన్ బెస్ట్ క్లబ్‌గా మంచిర్యాల లయన్స్ క్లబ్, బెస్ట్ డిస్టిక్ట్ చైర్ పర్సన్ పర్ విజన్‌గా వీ మధుసూదన్ రెడ్డి, కమిటెడ్ లయన్స్‌గా వరప్రసాద్, గుండా శ్రీనివాస్, వీరస్వామి, వినయ్ కుమార్, హన్మంతరావు, కిష్టయ్య, సిరిపురం శ్రీనివాస్, రామాంజనేయులు, కొత్త సురేందర్, గోలి రాము, బెస్ట్ జోన్ చైర్ పర్సన్‌గా డేగ బాబు, బెస్ట్ రీజియన్ సెక్రటరీగా సత్యపాల్ రెడ్డి, బెస్ట్ సర్వీస్ ఆక్టివిటీస్ హంగర్ రిలీఫ్ ప్రోగ్రాం, ఫ్రీ ఐ సర్జికల్ క్యాంపు, బ్లడ్ డొనేషన్ క్యాంపు, హెల్త్ క్యాంపులు నిర్వహించినందుకు గాను అవార్డులు లభించాయి. ఈ అవార్డులను రీజియన్ చైర్ పర్సన్ సుగుణాకర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

'పది' పరీక్షలు ధైర్యంగా రాయాలి : డీఈవో

నెన్నెల,మార్చి12 : పదో తరగతి విద్యార్థులు ఆందోళన చెందకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. మంగళవారం ఆవుడం, నెన్నెల జడ్పీఎస్ఎస్ పా ఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పదో తరగతి సిలబస్, ప్రేరణ కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. పలు పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగారు. భోజనశాలను పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం ప్రకాశ్‌రావ్ ఉన్నారు.

అక్రమ నిర్మాణాన్ని ఆపాలి

బెల్లంపల్లి, మార్చి 12: బెల్లంపల్లి పట్టణంలోని 31వ వార్డులో రోడ్డుపైనే అక్రమంగా చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని బస్తీ వాసులు కోరారు. మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, చైర్‌పర్సన్ జక్కుల శ్వేతకు మంగళవారం వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. వాహన చోదకులు వెళ్లే రోడ్డును ఆక్రమించి, మరీ నిర్మాణాలు చేపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బస్తీ వాసులు మామిడి దినేశ్, పులుగం వెంకటేశ్, బండారి రాజ్‌కుమార్,మురళి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ పరీక్ష

హాజీపూర్, మార్చి 12 : మండలంలోని వివిధ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు మండలంలోని గుడిపేటలో ఉన్న మౌంట్ కార్మెల్ పాఠశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. ప్రథమ స్థానంలో కస్తూర్బా బాలికల పాఠశాల(కర్ణమామిడి)కి చెందిన లక్ష్మీ ప్రసన్న, ద్వితీయ స్థానంలో శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం చెందిన అశ్విని(చౌక్కారాంనగర్), తృతీయ బహుమతి మౌంట్ (కార్మెల్ ముల్కల్ల)కు చెందిన హర్షిత, ప్రభుత్వ పాఠశాలకు చెందిన అర్చన అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి మౌంట్ కార్మెల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అల్ఫీతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీసీ నస్పూర్, మార్చి 12: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను చైర్మన్ సుర్మిళ్ల వేణు ప్రారంభించారు. డీఎంఎఫ్‌టీ నిధులు రూ.7లక్షలు మంజూరు కాగా న్యూరెడ్డి కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారు. ఈ పనులను మంగళవారం చైర్మన్ సుర్మిళ్ల వేణు ప్రారంభించి మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాలిటీకి పెద్ద ఎత్తున నిధులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గెల్లు రజిత, కౌన్సిలర్ వంగ తిరుపతి, నాయకులు బండారి సుధాకర్, పడాల సంజీవ్‌గౌడ్, గెల్లు మల్లేశ్, శ్రీనివాస్ రావు, బండారి సత్యనారాయణ, ఆడెపు ప్రభాకర్, కారుకూరి శ్రీనివాస్, కోసారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కత్తెరశాల జాతర ఆదాయం రూ. 15.95లక్షలు

చెన్నూర్ రూరల్, మార్చి 12: మండలంలోని కత్తెరశాల గ్రామంలో మల్లికార్జున స్వామి ఆలయంలో మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని మూడు రోజుల పాటు నిర్వహించిన జాతరలో వచ్చిన ఆదాయాన్ని అధికారులు మంగళవారం లెక్కించారు. మొత్తం రూ. 15,95 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. హుండీ ద్వారా రూ. 6.98 లక్షల ఆదాయం రాగా బహిరంగ వేలం ద్వారా రూ. 3.15లక్షలు, ప్రత్యేక దర్శనం రసీదుల ద్వారా రూ. 1.07లక్షలు. సులభ దర్శనం రసీదుల ద్వారా రూ.1.59 లక్షలు, కొబ్బరికాయల ముక్క ల ద్వారా రూ.13.500లు. తై బజార్ ద్వారా రూ 58.700లు. ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మిశ్రమ బంగారం 3 గ్రాములు 310 మిల్లీ గ్రాములు. మిశ్రమ వెండి 519 గ్రాముల 240 మిల్లీ గ్రాములు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, సిబ్బంది గోపి, సతీశ్, పరమేశ్వర్, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

పరామర్శ

జన్నారం, మార్చి 12 : మండలంలో తపాలాపూర్‌కు చెందిన సింగిల్ విండో మాజీ చైర్మన్ కమ్మల సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలుసుకున్న రాష్ట్ర మానవ హక్కుల మాజీ చైర్మన్ గుండ చంద్రయ్య వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

అనుమతి లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు

బెల్లంపల్లిరూరల్, మార్చి 12: బెల్లంపల్లి మండలంలోని కన్నాల రహదారిపై అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా హోటళ్లు, షాపులు, వైన్‌షాప్‌లు , రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ కన్నాల మాజీ సర్పంచ్ మంద అనిత కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో సోమవారం రెండవ సారి ఫిర్యాదు చేశారు. ఈ షాపులతో ట్రాఫిక్ సమస్యతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆమె గతంలో ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గతనెల 28న కలెక్టర్ బదావత్ సంతోష్ స్పందించారు. కన్నాల రహదారిపై అనుమతులు లేకుండా కొనసాగుతున్న నీలిమ వైన్ షాప్, వ్యాపారసంస్థలు, రియల్ ఎస్టేట్ వెంచర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అధికారులతో పాటు జిల్లా ఎక్సైజ్ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోలేదు. దీంతో సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో మంద అనిత రెండవ సారి ఫిర్యాదు చేశారు.

రిపోర్టర్ పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మంచిర్యాల ఏసీసీ, మార్చి 11: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారనే వార్త ప్రచురించినందుకు చెన్నూర్ పట్టణంలోని శిశుమందిర్ ఏరియాకు చెందిన రిపోర్టర్ కనుకుట్ల వెంకటరాజుపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్, సమత సైనిక్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్ధార్థ రామ్మూర్తి డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం 9 గంటల సమయంలో దాడి చేసి గాయపరిచారన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వెంకటరాజును పరామర్శించారు.

ఆలయాల్లో చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రామకృష్ణాపూర్, మార్చి 12: రామకృష్ణాపూర్‌లోని రైల్వే స్టేషన్ సమీపంలోని మహంకాళీ వేంకటేశ్వర, శివాలయాల్లో ఆదివారం రాత్రి హుండీలు పగులగొట్టి దొంగతనం చేసిన కేసులో నిందితుడిని రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు స్థానిక ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. సీసీ కెమెరాల పుటేజీల ఆధారాలను పరిశీలించి కంది రవిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

పదకొండైనా సార్లు రాలే. సిబ్బంది రాలే..


ఉదయం 11:10 గంటలైనా హాజరు కాని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

భీమారం, మార్చి 12 : భీమారం మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్ కార్యాలయాల్లో మంగళవారం ఉదయం 11: 20 గంటలు దాటినా అధికారులు, సిబ్బంది హాజరు కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాధ రాథోడ్‌తో పాటు, అధికారులు ఉదయం 11 గంటలైనా విధులకు హాజరు కాలేదు. సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్ మాత్రం 10.30 గంటలకు కార్యాలయానికి చేరుకున్నారు. ఈజీఎస్ శాఖ అధికారులు సైతం రాలేదు. తహసీల్ కార్యాలయంలో ఉదయం 11.20 గంటలు దాటినా తహసీల్దార్ సదానందంతో పాటు అధికారులు ఎవరూ హాజరు కాలేదు. దీంతో ప్రజలు అధికారుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. కలెక్టర్‌తో మీటింగ్‌కు వెళ్లినట్లు కింది స్థాయి సిబ్బందికి అధికారులు తెలిపినట్లు సమాచారం..


ఉదయం 11 గంటలైనా హాజరు కాని తహసీల్ కార్యాలయ సిబ్బంది

సింగరేణి

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి
- మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరం

వరల్డ్ క్యాన్సర్ డే పై కరపత్రాలు విడుదల చేస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, మార్చి 12 : మహిళలకు వచ్చే క్యాన్సర్లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి కోరారు. మంగళవారం శ్రీరాంపూర్ సింగరేణి వైద్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేశ్ బాబు అధ్యక్షతన శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో మహిళలకు మెడికల్ క్యాంపు, క్యాన్సర్లపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం సంజీవరెడ్డి, సేవా సమితి అధ్యక్షురాలు రాధాకుమారి పాల్గొని మాట్లాడారు. మహిళలు రొమ్ము క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి చికిత్స పొందితే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం మహిళలకు గైనకాలజిస్ట్ హరిత, జనరల్ సర్జన్ శ్రీకాంత్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ మనీషా, హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ కేన్సర్లపై అవగాహన కల్పించి, మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూజీఎం పురుషోత్తంరెడ్డి, డీవైజీఎం అరవింద రావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శౌరి, మరళీధర్, డీవైపీఎం కాంతారావు, సేవా కార్యదర్శి కొట్టె జ్యోతి పాల్గొన్నారు.

కార్మికుడికి నివాళి

రామకృష్ణాపూర్, మార్చి 12: రామకృష్ణాపూర్ పట్టణంలో నివాసం ఉంటూ ఆర్కేపీ సీహెచ్‌పీ కార్మికుడు ఆత్రం సంజీ (45) సోమవారం సాయంత్రం గుండెపోటుతో ఇంట్లోనే మరణించాడు. 15 సంవత్సరాల పాటు ఏఐటీయూసీ ఆర్కేపీ సీహెచ్‌పీ పిట్ కార్యదర్శిగా పనిచేశాడు. ఇటీవల ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘంలో చేరారు. సంజీ మృతదేహానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మంగళవారం నిర్వహించిన సంజీ అంతిమ యాత్రలో పాల్గొని ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, మాజీ ఎమ్మెల్యే పాడె మోశారు. సంజీకి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మార్చి 12: శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే న్యూటెక్ గని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ నాయకులు మేనేజర్ స్వామిరాజుకు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, మస్కె సమ్మయ్య వినతి ప్రతం అందజేశారు. కొత్త యంత్రాల ఏర్పాటు, సేఫ్టీ మెటీరియల్, వర్క్‌నామ్స్ ప్రకారం కార్మికులకు పనుల కేటాయింపు, పని భారం, క్యాటగిరి ప్రకారం పనులు, జన్మభూమి పనులు రద్దు, క్యాంటీన్లో మెనూ పాటించడం, తదితర అంశాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, కార్యదర్శి సంపత్, పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు సందీప్, నర్సయ్య, శంకరయ్య, అజయ్, నారాయణ, మల్లేశ్, శ్రీకాంత్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి కార్మికుల సాయం

శ్రీరాంపూర్, మార్చి 12 : శ్రీరాంపూర్ ఆర్కే 6గని క్యాంటీన్‌లో పనిచేసే మణెమ్మ కూతురు వివాహానికి ఆర్కే 6గని కార్మికులు, సూపర్‌వైజర్లు, అధికారులు రూ. 52 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు, అధికారులను గని మేనేజర్ తిరుపతి, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో గని సేఫ్టీ ఆఫీసర్ కాదాసి శ్రీనివాస్, డిప్యూటీ మేనేజర్ కొమురయ్య, రంజిత్‌కుమార్, అండర్ మేనేజర్ శరత్, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి సంగం సదానందం, నాయకులు నర్సయ్య, రాంచందర్ అడ్డు శ్రీనివాస్, పొగాకు రమేశ్, గొర్ల సంతోష్, కుమారస్వామి పాల్గొన్నారు.

గ్రాట్యూటీపై సీలింగ్ రూ.25 లక్షలకు పెంపు

శ్రీరాంపూర్, మార్చి 12 : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల గ్రాట్యూటీపై రూ.20 లక్షల నుంచి 25 లక్షలకు పెంచుతూ కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఉద్యోగులకు, కార్మికులకు పెంచిన గ్రాట్యూటీ 8 మార్చి 2024 నుంచి అమలవుతుందని పేర్కొన్నారు. గ్రాట్యూటీ సీలింగ్ రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడంతో కేంద్ర ప్రభుత్వ 49.18 లక్షల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. డీఏ 4 శాతం పెంచడం జరిగిందని, దాంతో 68 లక్షల మంది పెన్షనర్ దారులకు లాభం కలుగుతుందని తెలిపారు. వెంటనే కోలిండియా యాజమాన్యం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న మాదిరిగా వెంటనే 25 లక్షల గ్రాట్యూటీ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కోలిండియా జాప్యం చేస్తూ అమలు చేసిందన్నారు. గతంలో 2016లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తే కోలిండియాలో 2017లో బొగ్గు గని అధికారులకు, 2018లో కార్మికులకు అమలు చేశారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఒకే పాలసీ అమలు చేయాలని, బొగ్గు గని కార్మికులకు 8 మార్చి 2024 నుంచే 25 లక్షల గ్రాట్యూటీ అమలు చేయాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జనక్‌ప్రసాద్ కోలిండియా చైర్మన్‌కు, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ మంత్రికి లేఖ రాయనున్నారని తెలిపారు.

శ్రీరాంపూర్ ఏరియా పీవోలతో సమీక్ష

శ్రీరాంపూర్, మార్చి 12 : శ్రీరాంపూర్ ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓసీపీల పర్సనల్ అధికారులతో మంగళవారం జీఎం ఆఫీస్‌లో డీవైజీఎం(పర్సనల్) అరవిందరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల జీతభత్యాలు చెల్లింపు, ప్రమోషన్లు, రిటైర్డ్ టర్మినల్ బెనిఫిట్స్ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో డీవైపీఎం రాజేశ్వర్‌రావు, రాజేశ్, దేవేందర్ రెడ్డి, పాలకుర్తి రాజుఇ సీనియర్ పీఓ కాంతారావు, సునీల్, గౌస్ పాషా, రణదీప్‌గౌడ్, సంతన్, పాల్‌సృజన్, రమేశ్ పాల్గొన్నారు.

రాజ్యాంగం జోలికి వస్తే ఊరుకోం

- ఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ

సీసీసీ నస్పూర్, మార్చి 12: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం జోలికొస్తే చూస్తూ ఊరుకునేదిలేదని మాదిగ హక్కుల దండోరా(ఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే తాము రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ సీనియర్ నేత, ఎంపీ అనంత్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. నిండు బహిరంగ సభలో హెగ్డే మాట్లాడిన తీరుపై బీజేపీ వైఖరిపై అనుమానాలున్నాయని తెలిపారు. అణగారిన వర్గాలపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే అనంత్ హెగ్డేను పార్టీ నుంచి బహిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.